# టెక్నిక్

"అంటే ఏమిటటా?

అలకతో అవతలికి తిరిగి పడుకుంది ప్రియురాలు. ప్రియురాలా? భార్యా?

ఆ చెప్పిన వాడు మరొకడూ మరొకడూ కాడు.

తెనాలి రామలింగడు.

భార్య మీదే అయితే అంత కవిత్వం ఖర్చు పెట్ట వలసిన అవసర మేముంటుంది?

ఏమో! కవులెవరూ భార్యల మీద కవిత్వం చెప్పరా?

ఇతరుల భార్యల మీదయితే గొప్పగా చెబుతారు అన్నాడొక కొంటె కోణంగి.

ఒక వేళ భార్యే ప్రియురాలుగా కవిత్వాన్ని పలికించ కూడదా?

పలికించే సాధనం బులిపించడమే కదా!

తేనెలూరే దొండపండు లాంటి నిండు పెదవి అందివ్వలేదు సరికదా కనుచూపయినా ఆ అమృతభాండం మీద పడకూడ దన్నట్టు అవతలికి తిరుక్కుంది.

పెదవులేనా?

పరువాల పంటలైన స్తనభరాలు కూడా రేఖా మాత్రంగానైనా కనిపించనివ్వకుండా వత్తిగిలి పడుకుంది.

మన్మథుడితో గుసగుసలాడేట్టు కదిలే గాలి తరగల్లో పులకించే కుటిల కుంతలాలను కూడా ఆ నవరసికుడి దృష్టి పథం నుంచి దాచుకుంది.

క్షణం కుదురుగా ఉండక చంచలించే కనుదోయిని కూడా అతని కంట పడితే పాపమన్నట్టు తిప్పుకుంది.

అయితే ఏమిటిటా?

అయితే ఏమిటిటా?...."

ఆగి రెట్టించాడు చంద్రం.

సుభాషిణి చెవులు రిక్కించింది.

అరగంట దాటిన అలకలో ఇది కవిత్వపు మలుపు తిరిగిన అధ్యాయం. లొంగకూడదు.

అటు తిరగ కూడదు. అతణ్ణి చూడకూడదు.

ఇటు తిరిగి పడుకున్నా అతని మాటలు వింటున్నట్టు అనిపించ కూడదు. కనిపించ కూడదు.

ఎప్పుడూ ఇంతే. తుంటరి. రౌడీ బుద్ధులు. ఏవేవో పేలుతాడు. ఏడిపిస్తాడు. తర్వాత మళ్ళీ మాటలతో వైద్యం చేస్తాడు.

కోసేదీ అతనే. మందు వేసేదీ అతనే.

భార్యగా అనీ....అలుసు.

ఈ రోజు...ఈ రాత్రి...చచ్చినా భ్రమసి పోకూడదు.

అయినా ఇదేదో తెనాలి రామలింగడి గొడవ. తమాషాగా చెప్తున్నాడు. ఆమె ఎవరో అలిగి పడుకుంది. అటు తిరగలేదు. తిరక్కూడదు. అంతే!

ఊపిరి బిగబట్టినట్టు ముడుక్కుని పడుకుంది సుభాషిణి.

చంద్రం గొంతు సవరించుకున్నాడు మళ్ళీ...

"అయితే ఏమిటిటా?

అద్భుతమైన అందాలన్నీ అటు తిరిగే పడుకున్నా ఇటు వైపు మాత్రం సొగసులకేమీ తక్కువ లేదు సుమా! ప్రియాతి ప్రియా...అన్నాడు తెనాలి వాడు...

ఇసుక తిన్నెలపై వెన్నెలని వెక్కిరించే అందమైన పిరుదులు...తాకితే చీకటి రాలేంత చిక్కటి శిరోజాలూ ఇటువైపే ఉన్నాయి...

ఈ పూటకి మాకు కనువిందు చేయడానికి ఈ మహా సౌందర్యాలు చాలవూ...అన్నాడు తెనాలి వాడు....

మహానుభావుడే సుమా! లేకుంటే ఈ అపురూప సౌందర్యాలను తనివి తీరా దర్శించే రసికత్వం మనకు లేకనే పోవును...ఆహా!..."

సుభాషిణి గుండె జల్లు మన్నది.

అతని చేయి కాదు. చూపులే చురుక్కు మన్నట్టయింది పిరుదుల మీద. ఆడ బొడవునా ఏదో జెర్రి పాకినట్టు అదిరిపాటు కలిగింది.

"తెనాలి వాడి దారిలో వెళ్తే చాలా చాలా అందాలు తెలుస్తున్నాయి. ఈ వంపులూ సొంకాలూ మామూలుగా ఉండే తీరే వేరు....అలిగి పడుకున్నప్పుడు...దాచుకున్న వలపంతా పొంగుతున్నట్టు ఇవి విజృంభించే తీరే వేరు..."

"ఛీ!..."

అందే గాని ఆ మాటలకి ఒళ్ళు గగుర్పొడిచింది.

కవిత్వాన్ని ఇలా పడకటింట్లో ప్రయోగిస్తారా ఎవరైనా?

తెనాలి వాడి ప్రియురాలు ఆ తర్వాత ఏం చేసిందో గాని చంద్రం నెత్తిన మంచి నీళ్ళ కుండ పగల గొట్టాలనిపించింది సుభాషిణికి.

కానీ మాట్లాడకూడదు. అతని మాటలకు రియాక్ట్ కాకూడదనే నిర్ణయం ఉండనే ఉంది.

మెల్లగా దుప్పటి తీసి ఒంటి నిండా కప్పుకుంది. చివరికి తలమీద కూడా...ముసుగు పెట్టుకుంది.

ఇంకేం కనిపిస్తాయి అందాలు?

"శభాష్!" అన్నాడు చంద్రం.

రాగ వరసలో గొంతెత్తి పాడాడు:

వర బింబాధరముల్ పయోధరములున్ వక్రాలకంబుల్ మనో
హర లోలాక్షులు చూప కవ్వలి మొగం బైనంత నేమాయె నీ
గురు భాస్వత్ జఘనంబు క్రొమ్ముడియు మాకున్ జాలవే గంగ క
ద్దరి మే లిద్దరి కీడున్ గలవె యుద్యత్ రాజబింబాననా!

ఆలాపన తరువాత ఇంకా వ్యాఖ్యానం కూడా...

మనసైన మచ్చెకంటి సౌందర్యం గంగానది వంటిదే కదా! నది అన్న తరువాత అటయినా ఇటయినా ఒకటే! ఎటైనా గంగ కాక పోతుందా? నవ రసికుడి మోహదాహాన్ని తీర్చ లేక పోతుందా?

అన్నాడయ్యా తెనాలి వాడు...

ఫలశ్రుతి ఏమిటంటే...

అమ్మాయి గారి అలక తీరినట్టే ఉంది. అలక తీరిన క్షణాన్నే మేలి నవ్వుల వెన్నెల చిందిస్తూ తిరిగా చూసినట్టు ఉంది... లేకుంటే...ఉద్యత్ రాజబింబాననా...అని ఎందుకంటాడూ?

మన ప్రియురాలు దుప్పటి కప్పేసుకుంది.

దీనికేం చెప్పేవాడో తెనాలి సరసుడు.

మనమా? కవులం కాక పోతిమి!

ఏం చేస్తాం? ఉద్యద్రాజ బింబాననా...అనుకుంటూ దేవీ ప్రసన్నం ఎప్పుడవుతుందా అని ఎదురు చూడాల్సిందే! ఉద్యద్రాజబింబాననా.... ఉద్యద్రాజ...బింబ...

...నవ్వును నొక్కుకుంది సుభాషిణి.

కుదిరింది తిక్క అనుకుంది కసిగా.

పద్యాలతో అలిసి నిట్టూర్చాడు చంద్రం.

దుప్పటి మీద అతని చెయ్యి పడుతుందేమోనని ఎలర్ట్‌గా ఉంది సుభాషిణి. అంత పని చెయ్యలేదతను.

అలకల్లో ఆమె భద్రకాళి అవుతుంది.

విదిలించి కొడుతుంది.

ఆ సంగతి అతనికి బాగా తెలుసు.

అందుకే ఈ అనునయాలూ బుజ్జగింపులూ కవితా గానాలూ...

అలిసిట్టు అటు తిరిగా పడుకున్నాడు చంద్రం.

నిద్ర రాదు.

సద్దు మణిగాక రాత్రికి ముద్దులతో వన్నెలు దిద్దాల్సిన వేళ గదిలో గడియారం టిక్కూ టిక్కూ మంటోంది.

తాతల నాటి గడియారం...

సుభాషిణి చెవి దగ్గర టిక్ టిక్ టిక్ మంటోంది రిస్ట్ వాచీ. పడకలో కూడా దాన్ని తీయదామె.

పెళ్ళి నాటి వాచీ. గోల్డ్ చెయిన్. రేడియం డయల్. మధురానుభూతులకు అదే సాక్షి.

గుచ్చుకునే వేళల్లో తీసెయ్య బోతాడు చంద్రం.

వద్దు ఉండనివ్వ మంటుంది సుభాషిణి.

అంత ఇష్టం.

ఇవాళ దాన్ని కూడా విసిరి కొట్టాలనిపిస్తోంది.

టిక్ టిక్ టిక్ మని ఎంత సేపు రొద చేయాలి అది?

గుండెల్లో సన్నటి రొదలా మొదలై సమ్మెట పోట్లలా తగుల్తున్నాయి చంద్రం మాటలూ చేష్టలూ...

మగాళ్ళు ఏం మాట్లాడినా చెల్లి పోతుందని కాబోలు...

కలహమంటే పెద్ద కలహమని కాదు...

కాని మాట పట్టింపు వచ్చిన తర్వాత దాన్ని దిద్దుకునే తీరులోనే కదా మంచీ చెడ్డా తెలిసేది!

మూడు రోజుల క్యాంప్ తర్వాత ఆవురావురు మంటూ ఆ సాయంత్రమే తిరిగొచ్చిన చంద్రం సుభాషిణి కొంగు పుచ్చుకుని ఇల్లంతా చిన్న పిల్లాడిలా తిరుగుతూనే ఉండి పోయాడు సరే బాగానే ఉంది...

మూడు రాత్రుల విరహం తర్వాత ఈ రాత్రి క్షణం వృథా కాకుండా పండిపోతుందనుకుంటూ కాస్త ముందే డిన్నర్ కానిస్తుండగా డైనింగ్ టేబుల్ దగ్గర వచ్చింది విచిత్రమైన ప్రస్తావన...

"అన్నట్టు సుభా!...వేళ్ళేటప్పుడు రైల్లో ఓ అమ్మాయి పరిచయమైందోయ్! మంచు కురిసిన ఎర్ర గులాబీలా మనోహరంగా ఉంది..." అంటూ మొదలెట్టాడు చంద్రం.

చంద్రం అందరి లాంటి వాడు కాదు. ఆ సంగతి సుభాషిణికి బాగా తెలుసు.

రసికుడు. సరసుడు. కవితా ప్రియుడు. బుద్ధికి కేవలం చిన్న పిల్లవాడు. స్నేహంలో అరమరికలు లేని పసివాడు.

పెళ్ళయిన కొత్తలో అనుమానించి భయపడింది కాని తర్వాత అతని గొప్పతన మేమిటో తెలిసి అతని మాటల వెనుక నిజాల్ని మాత్రం అర్థం చేసుకోవడం మొదలెట్టింది.

అమాయక రసికుడే కాకుంటే భార్య దగ్గర పరాయి స్త్రీలను గురించి చెప్పి సంతోషిస్తాడా?

నాకెందుకండీ చెబుతారు? అసూయ పడనూ? అంటే...భలే దానివే నీకన్న నాకు ఇంకెవ్వరున్నారు? నా బెస్ట్ ఫ్రెండ్‌వి నువ్వే కదా!...అనే భోళా మనిషి చంద్రం. అతని మీద కోపం జన్మకి రాకూడదు కాని...

రైల్లో తారసపడ్డ అమ్మాయిని ఒళ్ళు మరిచిపోయి పొగుడుతున్నాడు చంద్రం. ఎత్తుగా ఎర్రగా తేనె కళ్ళతో తేనె పెదవులతో తేలిపోయే ముంగురులతో ...అప్సరసలా ఉందిట...

అంతే కాదు. ఆమెకు కవిత్వమంటే చాలా ఇష్టమట. చంద్రం పద్యాలు వినిపిస్తూ ఉంటే ఆమె మైమరచి పోయిందట! ఆమె ఉర్దూ గజళ్ళు కొన్ని

వినిపించిందట. వాటి అర్థం చెప్పిందట...

"అలాంటి అమ్మాయి తోడు దొరకడమంటే...అదీ అదృష్టం! చేసుకోబోయే వాడెవడో...అదృష్టవంతుడు...మాట వరసకి...అటువంటి అమ్మాయి నాకు దొరికి ఉంటేనా..."

అన్నాడు చంద్రం. మాట వరసకే అన్నాడు. మాట వరసకి ఎన్ని అనుకోకూడదు! కాని...

సుభాషిణి మనస్సులో వరసగా బాంబులు పేలాయి.

"అయితే ఆ అమ్మాయి వెంటే వెళ్ళి పోక పోయారా?..."

"భలే! ఎక్కడికని వెళ్ళను?..."

"పోనీ...ఇక్కడికే తీసుకు రాక పోయారా?"

"ఆc...అదెలా వీలవుతుంది?..."

దాంతో వచ్చింది గొడవ. ఇది కూడా మాట వరసకి కాదు కదా!

"అయితే వీలయితే తీసుకొద్దామనే?"

"నేను తీసుకు రావడమేమిటి? తనెలా వస్తుంది?"

"వస్తే మాత్రం తీసుకొద్దామనే?"

"వచ్చి...తీసుకొచ్చినా...నువ్వెలా రానిస్తావు?"

"నేను రానిస్తే తీసుకొద్దామనే?"

"ఇక నువ్వే రానిస్తే..."

"అయితే...అంత ఇష్టమన్న మాట...అదంటే..."

"సుభా...ఆ అమ్మాయిని...అది...అన్నావా? తప్పు కదూ పాపం..."

అయిపోయింది. అంటుకున్నది కాస్తా రాజుకుంది. రాజుకున్నది కాస్తా రగులుకుంది.

డిన్నర్ అర్థాంతరంగా ముగిసి పోయింది.

బెడ్రూం లో సెగలు పొగలు.

ఆమె మనస్సు ఇంకా మండుతూనే ఉంది.

మూడు రాత్రులు కంటికి కునుకు లేక అతని కోసం పడిగాపులు పడ్డాక తీరా తిరిగొచ్చి అతనిచ్చిన మధురానుభూతి ఇదీ.

మాట వరసకైనా రైల్లో అమ్మాయి అతనికి అంతగా నచ్చినప్పుడు అతని కోసమే వేగిపోయిన ఈ అందాలకు విలువేమిటి?

అతనేమిటో గొణుక్కుంటున్నాడు. చెవులు రిక్కించింది సుభాషిణి.

"నువ్వా మగాడివే...ఎప్పుడూ తిరుగుతూనే ఉంటావు. ఎంత తిరిగినా మళ్ళీ మీ ఆవిడ దగ్గరికి రాక తప్పదు. భార్య దగ్గర్నుంచి వెళ్తావు. భార్య దగ్గరికే వెళ్తావు. పెళ్ళి మంత్రాల్లో మమ జీవన హేతునా...అంటే అర్థం ఇదే కదా! అదే నీ జీవితం. నిన్ను పట్టి ఆపెయ్యాలనుకుంటుంది నీ భార్య. కాని నువ్వు ఆగవు. నిజానికి నువ్వు అలా వెళ్ళి తిరిగి రావడమే నీ భార్యకు కూడా ఇష్టం..."

ఏదో నాటకంలో డైలాగు చెప్తున్నట్టు అంటున్నాడు చంద్రం. బొత్తిగా అర్థం కావడం లేదు. ఏదో కొత్త ఎత్తుగడ.

కదలకుండా కళ్ళు మూసుకుంది సుభాషిణి.

కదిలితే చాలు. అటు తిరిగితే చాలు. నవ్వితే చాలు.

అతను గెలిచేస్తాడు.

మళ్ళీ అతని ముఖం చూస్తే తను తట్టుకోలేదు! అంత జాలిగా ఉంటుంది అతని వాలకం! చూపుతో మాయ చేసేస్తాడు! ఈ మగాణ్ణి జన్మకి నమ్మకూడదు.

రైల్లో పిల్లా? అప్సరసా? ఎర్ర గులాబీనా?

తనేం కాలక్షేపానికా?

బలవంతంగా నిద్ర తెచ్చుకుంటూ కళ్ళు మూసుకుంది. దిండు వారగా చెవి దగ్గర వాచీ రొద పెడుతోంది. టిక్ టిక్ టిక్...

"అయిందా తిరగడం? చివరకు మీ ఆవిడ దగ్గరికే వస్తున్నావా? వచ్చేశావా? ఆహా! ఎంత చక్కగా ఎంత ఒద్దికగా ముద్దు పెట్టుకుంటున్నావు? దాంపత్యమంటే మీదే... అన్యోన్యత అంటే మీదే...ఎంత మధురం...ఎంత కనుల పండువ మీ కాపురం!..."

ఆపకుండా మాటలు దొర్లిస్తూనే ఉన్నాడు చంద్రం.

ఒక్క ముక్కా అర్థం కావడం లేదు సుభాషిణికి.

ఏదో ట్రిక్ ప్లే చేస్తున్నాడు. తనను కదిలించడానికి. నవ్వించడానికి. అలక తీర్చెయ్యడానికి....ట్రిక్ ఏమిటో అర్థం కాదు...

రైల్లో అమ్మాయిని తలుచుకుంటున్నాడేమో! తెగ ఒలక బోస్తున్నాడు కవిత్వం.

"నిత్య నూతనమైన మధురానుభూతి మీ స్వంతం! గంట సేపట్నుంచి ...పుష్పం దాచుకున్న మకరందాన్ని పీల్చేస్తున్నట్టు...జీవితానందాన్నే

గ్రోలుతున్నట్టు... ఇంకెంత సేపు? నలభై ఎనిమిది దాటగానే ... అయిపోయింది ... అయిపోయింది కదూ? అమ్మాయీ దిగులు పడకు... నీ అనంత వసంత ప్రియుడు మళ్ళీ వస్తాడు... వచ్చేస్తాడు!..."

గబుక్కున తిరిగి చాచి లెంపకాయ కొడదామనిపించింది. ప్రియుడెవరు? ప్రియురాలెవరు? ఈ గేమ్స్ నా దగ్గర కాదు. నీ రైలు పిల్ల దగ్గర ఆడుకో... నేను నీ భార్యని... మూడ్ బాగులేదంటే... నోరు మూసుకుని పడుకో... అని అదిలించాలనిపించింది.

అంత పనీ చేస్తే వ్రత భంగ మైనట్టే. అతను గెలిచేసినట్టే.

నిద్రలో కదిలినట్టే కదిలి చేతులు విదిలించింది. మళ్ళీ ముడుచుకుని దుప్పటి గట్టిగా బిగించుకుంది.

చలి లేనప్పుడు దుప్పటి కప్పుకోవడం పెద్ద శిక్ష!

అతని మాటల కన్న ఎక్కువగా ఇబ్బంది పెడుతోందిప్పుడు రిస్ట్ వాచీ! టిక్ టిక్ టిక్...

దుప్పట్లో చీకట్లోనే టైము చూసుకుంది.

రేడియం డయల్ తొమ్మిదీ యాభై చూపెడుతోంది.

భగవాన్ నాకు నిద్ర కావాలి...

"నేను మొండినైతే నా ప్రియురాలు మహా మొండి... మా కాపురం జగమొండిగా అఘోరిస్తోంది గాని మీకేం నిత్య నూతన దంపతులు... అలిగినట్టు దూరమైనా అంతలో దగ్గరవుతారు. విరహంతో వేగిపోయే శరీరాలను ఒక్క నిముషమైనా ఏకం చేసుకుంటారు... ఆదర్శ దంపతులంటే మీరే సుమా! మీకు విరహం ఉన్నా అది శాశ్వతం కాదు... నిజానికి... కాలాన్ని గెలిచే ప్రేమంటే మీదే..."

గాడ్! అతని గొంతుని ఎలా నొక్కడం? మామూలుగా శృంగార పర్వంలో అతను అధిక ప్రసంగాలు చేసేప్పుడు... తిరగబడి నవ్వుతూ పెదవులతో అతని నోటికి తాళం వేసెయ్యడం ఆమెకు అలవాటు. ఇప్పుడు కూడా ఆ పనే తప్పదనట్టు పెదవులు తహతహలాడిపోతున్నాయి.

అందుకే ఇలా కవ్విస్తున్నాడా?

రైల్లో పిల్ల ఎటు పోయిందో ఏమైందో తనకెందుకు?

వెర్రితనం కాకుంటే ఆ సన్నివేశం అంతా తనకు చెప్పుకుంటాడా?

పడకటింట్లో పగ రగిలించు కుంటాడా?

ఇంత సేపట్నుంచి ఎంత తంటాలు పడుతున్నాడో పాపం.

గోడ గడియారం వరసగా పదకొండు కొట్టింది. కాస్సేపట్లో రాత్రే కరిగిపోతుంది.

అతను విసుగ్గా నిద్రా లేనట్టు కలవరిస్తున్నాడు.

"ఓ దైవమా!... ఈ కాలాన్ని ఆపెయ్యకూడదా? ఈ రాత్రిని... ఆపెయ్య కూడదా? అలిగిన నా నెచ్చెలి మనస్సు ఊరట పడే దాకా..."

అదిగో జాగ్రత్తగా ఉండాలి. ఇవన్నీ డ్రామా ట్రిక్కులు. ఈ మాత్రానికే మునిగిపోదు.

ఒక్క రాత్రి పస్తుంటే గాని తిక్క కుదరదు. అంతే!

కుడివైపు తిరిగి పడుకోవడంతో కుడిచెయ్యి కుడికాలు కుడిచెంప ...అన్నీ మొద్దుబారి పోయాయి.

దుప్పటి విసిరి కొట్టేస్తే మళ్ళీ అతని కన్ను పడి కవిత్వాల్లోకి దిగినా కష్టమే!

లేచి లైటార్పేయాలని మంచి నీళ్ళు తాగాలని బలంగా అనిపిస్తూ ఉన్నా ఆ కోరికల్ని కూడా బలవంతంగా అణిచిపెట్టుకుంది సుభాషిణి.

ఏం? తను నిద్రపోయినట్టు పడి ఉంది కదా? నిజంగా నిద్రపోయి ఉండవచ్చు. అతను తాక కూడదా? తను విదిలిస్తే విదిలిస్తుంది. తప్పేమిటి?

అతని బెట్టు కాకుంటే!

గొప్ప చాతుర్యం కాబోలు.

మగరాయుడి ధీమా! ఆడది కదా... దిగి రాక ఏం చేస్తుందని...

పక్కలో కదుల్తూనే ఉన్నాడు గాని తాకడు. తగలడు. తనేనా అంత తక్కువ తిన్నది?

పోనీ. రాత్రంతా ఇలాగే వేస్ట్ అయిపోనీ!

సారీ. ఎప్పుడూ టీజ్ చెయ్యనులే... అనడు కదా!

తిక్క కుదరాల్సిందే!

కాని మధ్యలో ఈ వెర్రిమొర్రి డైలాగులేమిటో అర్థమే కాదు. ఎంత ఓపిగ్గా వాగుతున్నాడు! ఇప్పటికి మూడు గంటలుగా!

మహా మొండి ఘటం. ఒకంతట పట్టు వదలడు. అందుకే భయం.

ఇప్పుడు లొంగితే ఎప్పుడూ ఇలాగే ఉడికిస్తాడు.

"రాత్రంతా నాకిలాగే గడవనీ కానీ నువ్వూ మీ ఆవిడా సుఖంగా ఉండండి! మళ్ళీ వెళ్తున్నావు కదా...పాపం ఆవిడ మెట్లెక్కి మెట్లెక్కి నీకోసమే కాచుక్కూచుంది...వెళ్ళు వెళ్ళు...నీ కోసమే విరహం! ఒక్క నిముషం పాటు నువ్వందించే అమరసౌఖ్యం కోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకుని వెయిట్ చేస్తోంది..."

సుభాషిణికి తిక్క రేగి పోతోంది. ఇంకా ఎంత సేపు సహించాలి?

నటిస్తున్న నిద్రని అతను నమ్మడమే లేదు.

ప్రతి మాట ఆమె గుండెల్లో మోగుతోందని తెలుసు. అందుకే చెలరేగి పోతున్నాడు.

"ఈ రాత్రి నేను ధన్యుణ్ణి సుమా! మీ నిత్యవసంతాల శృంగార చర్యల్ని కళ్ళారా చూడగలిగాను. అదిగో మహా పురుషుడు వస్తున్నాడు ... వచ్చేస్తున్నాడు...ఆమె మనస్సు జలదరిస్తోంది...తనువు పులకరిస్తోంది..."

అబ్బా! అనుకుంటూ చెవులు చేతులతో నొక్కుకుంది సుభాషిణి. అతను ఆగడం లేదు.

"మీ అర్థరాత్రి శృంగారమే అద్భుతం...అమోఘం...పన్నెండు గదుల ఇంటిలో ఇరవై నాలుగు సార్లు మీ కేళీ విలాసాలు! ఒక్కో గదిలో రెండుసార్లు! ఆమె గదంతా శుభ్రం చేసి వంటా వార్పూ చేసి పడక సిద్ధం చేసి ఉంచేసరికి నువ్వు చుట్టూ ఓ రౌండ్ వేసుకుని వచ్చేస్తావు. ఒక నిమిషం...ఒకే ఒక్క నిమిషం మీ కాపురం...మహా మనోహరం...ఆమె సర్వస్వం అర్పించుకుంటుంది...నువ్వు ప్రియంగా ఆక్రమించుకుంటావు..."

పన్నెండు గదులేమిటి? ఇరవైనాలుగు సార్లేమిటి? ఉలిక్కి పడింది సుభాషిణి. మెల్లమెల్లగా టిక్ టిక్ శబ్దం మనస్సు పొరల్లో తెరల్ని తొలగిస్తోంది.

సరిగ్గా అప్పుడే గడియారం పన్నెండు గంటలు కొట్టడం మొదలెట్టింది.

"ఆదర్శ దంపతుల్లారా! ఈ రాత్రి మీ కాపురాన్ని తిలకించి పులకించి పోతున్నాను నేను...అఫ్‌కోర్స్...మా ఆవిడ కూడా...దుప్పట్లో తన రిస్ట్ వాచీలో..."

దొంగలాగా అలాగే చూసుకుంది సుభాషిణి. నక్షత్రాల్లా మెరుస్తున్నాయి ముద్దుల రిస్ట్ వాచీలో ముచ్చటైన అంకెలు.

పన్నెండు దగ్గర రెండు ముళ్ళూ ఏకమై ఒకే గీత!

"ఏం చెప్పను ఆదర్శ దంపతులారా! మీ శృంగారాన్ని గమనిస్తూ నా నెచ్చెలి ఈ రాత్రి నన్ను మాత్రం ఘోరంగా అన్యాయం చేసేసింది..."

కథ తేలిపోయింది. తిక్క రేగిపోయింది.

"యూ ఇడియట్..."అంటూ దుప్పటి విసిరి కొట్టి చర్రున లేచి అటు తిరిగింది.

గోడ గడియారంలో రెండు ముళ్ళు కలిసిన దృశ్యాన్ని తన్మయత్వంతో చూస్తూనే ఉన్నాడు చంద్రం.

అతని దొంగ నవ్వు గమనించి కోపంగా కొట్టడానికి చెయ్యెత్తింది సుభాషిణి.

గాజుల చెయ్యి పడకటింట్లో పైకి లేస్తే ఏమౌతుంది?